బైపాస్ సర్వేకు బ్రేక్!

- బేల పక్కన నుంచి 4.15 కిలోమీటర్ల బైపాస్
- సర్వేను అడ్డుకున్న బాధిత రైతులు
- అధికారులు, రైతుల చర్చలు విఫలం



బేల పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న రైతులు (ఫైల్)

బేల: బేల, జైనథ్ మండలాల్లో రూ. 490.92 కోట్ల వ్యయంతో చేపట్టే 353బీ రెండు లేన్ల జాతీయ రహదారి 33 కిలోమీటర్ల విస్తరణ పనుల్లో భాగంగా బేల పక్కన నుంచి 4.15 కిలోమీటర్లు చేపట్టనున్న బైపాస్‌కు సర్వేకు బ్రేక్ పడింది. మండలంలోని డోప్టాల గ్రామ ఆర్టీసీ బస్టాండ్ సమీప ప్రాంతం నుంచి షంషాబాద్, బేల, బురాన్‌పూర్ గ్రామాల శివారు మీదుగా బైపాస్ నిర్మాణం జరగనుంది. జూలైలో ఎంజాయ్‌మెంట్ సర్వేను నేషనల్ హైవే అధికారులు ప్రారంభించారు. ఈక్రమంలో బాధిత రైతులు సర్వేను అడ్డుకున్నారు. తమ పొలాల్లోని ఎటువంటి సర్వే చేయనివ్వమని రైతులు తిరగబడడంతో అధికారులు చేసేదేమి లేక వెనుతిరిగారు.

ముందుకు సాగని సర్వే..

బైపాస్ బేలకు ఇటు అటుగా డోప్టాల బస్టాండ్ సమీపం నుంచి దహెగాం టీ జంక్షన్ వరకు ఉండనుంది. భోరజ్(జైనథ్) నుంచి ప్రారంభమయ్యే జాతీయ రహదారికి అనుసంధానంగా 21.85 నుంచి 26 కిలోమీటర్ల వరకు బైపాస్ నిర్మాణం మండలంలోని షంషాబాద్, బేల, బురాన్‌పూర్ శివారుల్లోని పొలాల గుండా నిర్మించనున్నారు. గతేడాది అక్టోబర్‌లో బైపాస్ భూ సేకరణ బాధ్యతలు రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించారు. భోరజ్ నుంచి బేలకు వచ్చే క్రమంలో జాతీయ రహదారికి ఎడమ వైపున బైపాస్ నిర్మాణం చేపట్టాలని హైవే అధికారులు నిర్ణయించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఫోర్ లైన్ రహదారికి సరిపడేలా మొత్తంగా 150 అడుగుల వెడల్పుతో భూ సేకరణ చేయనున్నారు. దాదాపు 45 ఎకరాల వరకు భూమి అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. గతేడాది నవంబర్‌లోనే రహదారి హద్దులను హైవే అధికారులు గుర్తించడం ప్రారంభించారు. గుర్తుగా ఎరుపు జెండాలు ఏర్పాటు చేశారు. జూలైలో సర్వేను ప్రారంభించగా రైతులు అడ్డుకున్నారు.

చర్చలు విఫలం..

జూలై 17న పోలీస్‌స్టేషన్‌లో ఆదిలాబాద్ డీఎస్పీ, ఆగస్టు 29న మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆదిలాబాద్ ఆర్డీవోలు నేషనల్ హైవే ఏఈతో కలిసి బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. బైపాస్ నిర్మాణానికి తమ భూములు ఏమాత్రం ఇవ్వమని అధికారులకు తెల్చి చెప్పారు. బైపాస్ కోసం వ్యవసాయ భూములు ఇవ్వమని బాధిత రైతులు చెప్పగా, సర్వేను అడ్డుకోవద్దని జిల్లా అదనపు కలెక్టర్ రైతులకు సూచించారు. ఈక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరిని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఆయన నివాసంలో అక్కడి బీజేపీ నాయకుల సహకారంతో కలిసేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

బైపాస్ ఎందుకు?



నేషనల్ హైవే ఫోర్‌లైన్‌గా మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలోని బల్లార్షా, రాజురా, గడ్‌చాందుర్, వన్‌సడీ, కోర్పణ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంది. అక్కడ ఎక్కడా కూడా బైపాస్ లేదు. అక్కడ లేని బైపాస్ ఇక్కడ ఎందుకు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారులకు కొమ్ముకాయడం సరికాదు.

– ధర్నే గోపాల్, రైతు, షంషాబాద్

బైపాస్ రద్దు చేయాలి



బేల బైపాస్ రద్దు చేయాలి. బైపాస్ నిర్మాణంతో 40మంది వరకు రైతులకు నష్టం వాటిల్లుతోంది. వ్యవసాయ సాగు భూములు కోల్పోయి, జీవనాధారం కోల్పోతాం. నేషనల్ హైవే అధికారులు బేల పాత మార్గంలోనే జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలి.

– దేశ్‌ముఖ్ గణేష్, రైతు, బేల

క్లుప్తంగా

1,176 గృహలక్ష్మి దరఖాస్తుల తిరస్కరణ

బేల: మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో 1,176 గృహలక్ష్మి దరఖాస్తులు తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు. మండలం వ్యాప్తంగా 5,257 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో స్లాబ్ ఇల్లు ఉన్న వారి దరఖాస్తులు 421 దరఖాస్తులు, మరో 755 దరఖాస్తులు స్థానికేతరులు, వివరాలు సరిగా లేని కారణంగా తిరస్కరించామన్నారు. మిగతా 4,081 దరఖాస్తులను అర్హులుగా గుర్తించారు.

'కాంగ్రెస్‌తోనే దళితుల అభివృద్ధి'



మాట్లాడుతున్న కొమ్ము విజయ్

ఇచ్చోడ: కాంగ్రెస్‌తోనే దళితుల అభివృద్ధి జరుగుతుందని పీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ము విజయ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు, అంబేద్కర్ అభ్యాసం పేరిట ప్రతి ఎస్సీ కుటుంబానికి రూ. 12 లక్షలు, ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు రూ. 750 కోట్లు కేటాయిస్తామన్నారు. నాయకులు ప్రతీ గ్రామానికి వెళ్లి ఎస్సీ డిక్లరేషన్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో బోథ్ నియోజకవర్గం చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపలి శ్రీధర్, అంజయ్య, నారాయణ, మహిముద్‌ఖాన్, ముస్తాఫా, జాహెద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నామట్టి.. నాదేశం విజయవంతం చేయండి'



మట్టిని సేకరిస్తున్న నాయకులు

నేరడిగొండ: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా నామట్టి.. నాదేశం కార్యక్రమాన్ని మండలంలోని వడూర్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమ ఇన్‌చార్జి మాధవ్ రావ్ ఆమ్టే, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీలు హాజరయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటికను నిర్మించేందుకు ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి చొక్కపల్లి రాములు, బీజేపీ మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్, సాబ్లే సంతోష్ సింగ్, గంధం నవీన్, ధర్మపురి రాఘవులు, తీగల నవీన్, రాథోడ్ రాజశేఖర్, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

10న సంస్మరణ సభ

ఉట్నూర్‌రూరల్: ప్రజాగాయకుడు గద్దర్, సియాసత్ ఎడిటర్‌ల సంస్మరణ సభను ఈనెల 10న ఆదివారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని ప్రజాసంఘాల కన్వీనర్ ముడుగు శామ్యూల్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. సంస్మరణ సభకు మంచిర్యాల, ఆదిలాబాద్‌కు చెందిన కళాకారులు తమ బృందంతో హాజరవుతారని, గద్దర్‌తో పనిచేసిన తమ అనుభవాలను, ఆయన పాడిన పాటలను వినిపిస్తారన్నారు. సమావేశంలో ప్రజాసంఘాల కమిటీ సభ్యులు బానోత్ రామారావు, నేతావత్ రాందాస్, లక్ష్మికాంతం, బానోత్ ప్రకాశ్, బండి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సాయినగర్‌ను అభివృద్ధి చేయాలి



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కాలనీవాసులు

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీని అభివృద్ధి చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పిచ్చిమొక్కలను కాలనీవాసులతో కలిసి తొలగించారు. కాలనీలో రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించలేదన్నారు. శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీవాసులకు అందుబాటులో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

కౌఠ రోడ్డు వద్ద బారికేడ్‌ల ఏర్పాటు

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామం వద్ద అంతర్‌రాష్ట్ర రహదారిపై గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో నాలుగు బారికేడ్‌లు ఏర్పాటు చేసినట్లు బోథ్ సీఐ భీమేష్ తెలిపారు. ఆదివారం బారికేడ్‌లను గ్రామం ముఖ ద్వారం ఇరువైపులా ఏర్పాటు చేశారు. ప్రమాదనివారణలో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించినట్లు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. ఆదివారం జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి నార్నూర్, గాదిగూడ మండలాల్లో పర్యటించారు. గాదిగూడ మండలంలోని కొత్తపల్లి(జీ) సర్పంచ్ కొట్నాక్ బారిక్‌రావు భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. నార్నూర్ మండలంలోని మంజిరి గ్రామ పటేల్ రాము అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం బాబేఝరి, ఖంపూర్ రోడ్డు, వంతెలను పరిశీలించారు. మాన్కాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నడ్డంగూడ నుంచి బాబేఝరి రోడ్డు మరమ్మతుల కోసం రూ. 2 కోట్లు, ఖంపూర్ నుంచి మాదాపూర్ రోడ్డుకు రూ. 1.55 కోట్లు, గాదిగూడ మండలంలోని మారేగాం నుంచి బుద్దగూడ కొలామా వరకు రూ, 6.13 కోట్లు మంజూరు చేయించామన్నారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నార్నూర్, గాదిగూడ మండలంలోని ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ, 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, గాదిగూడ వైస్ ఎంపీపీ మోగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, సర్పంచ్ రాథోడ్ సావీందర్, ఉర్వేత రూప్‌దేవ్, కనక ప్రభాకర్, మెస్రం మానిక్ రావు, పెందూర్ దీపక్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



కంది శ్రీనివాస రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

జైనథ్: కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస పిలుపునిచ్చారు. మండలంలోని మాంగుర్ల గ్రామానికి చెందిన షేక్ అహ్మద్, మజర్‌మైఉద్దీన్, అల్బేట్టి నాగన్న, షేక్ ఫారుఖ్, బీజేపీ నాయకులు విజయ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిమ్మ సంతోష్, భరత్ వాగ్మారే, షకీల్, అల్లూరి అశోక్ రెడ్డి, రాజ్ మొహమ్మద్, కిష్టారెడ్డి, సంతోష్, రవీందర్ రెడ్డి, ప్రవీణ్, రమేశ్, కొండూరి రవి, షేక్ మన్సూర్, ముఖీమ్, అంజద్ ఖాన్, కర్మ, అస్బాత్ ఖాన్, మహమూద్, హరీష్ రెడ్డి, గోలి వెంకటి, పొచ్చిరామ్, మంచాల గంభీర్, పోతారాజు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

'బహుజనులంతా ఏకతాటిపైకి రావాలి'



మాట్లాడుతున్న గణేష్ మహరాజ్

జైనథ్: బహుజనులంతా ఏకతాటిపైకి రావాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ కోరారు. ఆదివారం ఆదిలాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ పాదయాత్రను జైనథ్ మండలం పిప్పర్‌వాడ గ్రామం నుంచి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధిలో ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించాలన్నారు. పాదయాత్రలో ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, భీమేష్, కర్లేవారు రాకేశ్, గజానంద్ గౌడ్, వైలే కేశవరావు, కరాడి గంగన్న, రాజీవ్ బరికుంట, దేవన్న చిన్న గంగన్న, నాగరాజు, కేతిషిండే పాల్గొన్నారు.

ఆదివాసీ సేన జిల్లా కమిటీ ఎన్నిక

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివాసీ సేన ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాయిసిడం జంగు, ఉపాధ్యక్షుడిగా మండడి లక్ష్మణ్, ఆనక గంగారాం, వేద్మ చంపత్‌రావు, ప్రధాన కార్యదర్శిగా తొడసం లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా ఆడేం పొల్లన్న, కుంరం మానిక్ రావు, చహ్కటి రమేష్, కోశాధికారిగా కుద్మేత మనోహర్, సహాయ కోశాధికారిగా మేస్రం సుదర్శన్, జిల్లా కమిటీ ప్రధా న సలహాదారుడిగా ఉయిక లక్ష్మణ్, సభ్యులుగా సెడ్మకి కాశీరాం, ఆత్రం దేవిదాస్, జుగ్నా క్ తిరుపతి, తోడసం రమేష్, కనక విష్ణు, ఆత్రం రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు కోవ దౌలత్‌రావు మొకాశి, తొడసం భూమ పటేల్, కుంరం చత్రుఘన్, సేడ్మకి భీంరావ్, ఉయిక శ్యాంరావ్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష

కై లాస్‌నగర్: స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపడుతున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్వర్ణకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాంసి: భీంపూర్ మండల కేంద్రానికి సమీపంలో భారీ వర్షానికి విద్యుత్ తీగలపై చెట్టు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డు పక్కన ఉన్న చెట్టు 33 కేవీ విద్యుత్ తీగలపై పడిపోయింది. కాగా అర్లి(టి) సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నేటి నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

ఎదులాపురం: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదన్నారు.

10న పంచాయతీ కార్యాలయం ప్రారంభం

నార్నూర్: మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయం భవనాన్ని ఈనెల 10న ప్రారంభించనున్నట్లు సర్పంచ్ రాథోడ్ సావీందర్ ఆదివారం తెలిపారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎంపీ సోయం బాపురావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ కనక మోతుబాయిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రకృతి ఒడిలో జలపాతం



చుట్టూ పచ్చని చెట్లు, ఎత్తైన కొండల మధ్య ఉన్న పొచ్చర జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ప్రకృతి ఒడిలో బండరాళ్లపై నుంచి నీరు దూకుతూ.. తన అందాలను జాలువిడుస్తోంది. జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. దీంతో జలపాతం వద్ద సందడి నెలకొంది. – బోథ్

అంధకారంలో గ్రామాలు

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కానీ సాయంత్రం కురిసిన వర్షానికి భీంపూర్ మండల కేంద్రంలో భారీ వృక్షం విద్యుత్ తీగలపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో రాత్రి వరకూ ప్రజలు అంధకారంలో ఉన్నారు. కరెంట్ ఎప్పుడు వస్తాదో తెలియక ప్రజలు ఇబ్బంది పడ్డారు. అధికారులకు ఫోన్ చేసినా.. కనీసం స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

విద్యార్థినికి సన్మానం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన తుకారాం కుమార్తె హర్ష మెడికల్ సీటు సాధించడంతో ఆదివారం మండల ఉపాధ్యాయులు విద్యార్థిని ఘనంగా సన్మానించారు. అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాసండ్ల భూమన్న, బండి విజయ్, నాతరి రమేశ్, సాగాల ప్రవీణ్, మహేశ్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

ఇంద్రవెల్లి: పట్టుదలతో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సమతా సైనిక్ దళ్, భీం ఆర్మీ, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించిన కాంబ్లే ఉల్లాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు విక్రమ్, దత్త పరత్వాగ్, కాంబ్లే మారుతి, వాగ్మారే కాంరాజ్, పవార్ శివాజీ, సూర్యకాంత్, ఉత్తం, రాజేందర్, పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించండి

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసరాల్లో నెలకొన్న లోఓల్టేజీ సమస్యను అధికారులు పరిష్కరించడం లేదని ప్రజాళిక సంఘం జిల్లా మాజీ సభ్యుడు ఎంఏ వకీల్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోఓల్టేజీ కారణంగా రెండేళ్లుగా భీమన్నగుడి ప్రాంతంలోని ఇళ్లలో నీటి మోటార్లు సరిగా పనిచేయక పోవడంతోపాటు ఎలక్ట్రిక్ గృహోపకరణాలు దగ్ధమవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా 7, 8 వార్డుల పరిధిలో సింగల్‌ఫేజ్‌ను త్రీఫేజ్‌గా మార్చాలని కోరారు.

పేదల ఆకలి తీర్చడం గొప్ప కార్యం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: పేదల ఆకలి తీర్చడం గొప్ప కార్యమని ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి అన్నారు. సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో అన్నదానం నిర్వహించారు. జిల్లా కేంద్రానికి వచ్చే వారితో పాటు ఇక్కడ ప్రజలకు ఉచితంగా భోజనం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, మహేందర్ రెడ్డి, గంగాధర్, సలీమ్, సుభాష్, అంబయ్య, రాజయ్య, నిఖిల్ రెడ్డి, శేఖర్ లఖన్, సింగం పాల్గొన్నారు.

దంచి కొట్టిన వర్షం



ఉట్నూర్‌లో కురుస్తున్న వర్షం



ఇంద్రవెల్లిలో..

ఉట్నూర్‌రూరల్: గత కొన్ని రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో ఎండ వేడిమికి ఉక్కిరిబిక్కిరి అయినా ప్రజలు ఆదివారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. ఆదివారం ఉట్నూర్ వారసంత కావడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆదిలాబాద్, ఇచ్చోడ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు తమ వ్యాపారాలను ముగించుకొని వెనుదిరిగారు. మండల కేంద్రంలోని రహదారులు జలమయమయ్యాయి.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం వర్షం కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. గత పదిహేన్ రోజుల నుంచి వర్షం లేక ఆందోళనలో ఉన్న రైతులు రాత్రి నుంచి భారీ వర్షం కురవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎరువులు వేయడం, పంట కలుపు తీసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

'దళితుల సమస్యలు పరిష్కరించాలి'



మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీలోని దళితుల సమస్యలు పరిష్కరించాలని ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నాయకులు కలిశారు. ఆదివారం ఉట్నూర్ మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్తున్న మంత్రిని ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, సర్పంచ్ హరినాయక్, జగ్జీవన్, కాంబ్లే ప్రజ్ఞశీల్, కొల్లూరి స్వామి, జాడి వెంకటేశ్, సుశీల్, స్వామి, హరీశ్, శ్రీరంగ్, నికేశ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలి



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

బజార్‌హత్నూర్: ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలోని చింతలసాంగ్వీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తమ ప్రాథమిక హక్కుల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ సహకారం తీసుకోవచ్చని తెలిపారు. యువకులు అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన సిడం ప్రవళిక ఖమ్మం మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు సాధించడంతో ఆమెను సన్మానించారు. బోథ్ సీఐ భీమేష్, ఎస్సై నరేశ్, న్యాయవాదులు పంద్రం శంకర్, కృష్ణ ప్రసాద్, సర్పంచ్ మడవి ప్రకాష్, విజయ, ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, చందన్, కృష్ణ పాల్గొన్నారు.